ఆపదలో అభయహస్తం..

పేదల విద్య, ఆరోగ్యం పట్ల నిబద్ధత కలిగినప్పుడే ఆయా ప్రభుత్వాలను ప్రజలు నమ్ముతారు, ప్రేమిస్తారు. దివంగత నేత వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేదల పక్షపాతిగా పరిపాలన ఎలా ఉండాలో ఒక ఒరవడి సృష్టించారు. పేదలను అక్కున చేర్చుకుని వారి మేలు కోసమే పాలన సాగించారు. బడుగుల కోసం అనేక పథకాలు రూపొందించిన ఆయన ఆరోగ్యశ్రీ ద్వారా వారికి భరోసా కల్పించారు. కార్పొరేట్ వైద్యాన్ని వారికందించారు.

- ఎందరికో ప్రాణదానం చేస్తోన్న ఆరోగ్యశ్రీ పథకం
- మహానేత రాజశేఖర్‌రెడ్డి ముందు చూపు గొప్పదంటున్న లబ్ధిదారులు
- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా అమలు


గుండె జబ్బుతో బాధపడుతున్న సత్యనారాయణకు ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఆరోగ్య శ్రీ పథకం ఎంతో మంది నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఆరోగ్య శ్రీ పథకాన్ని మరిన్ని వ్యాధులను చేర్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మెరుగుపరిచారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన ప్రజలు నేడు హాయిగా జీవిస్తున్నారు. కార్పొరేట్ వైద్యం అంటే అవగాహన లేని పేద ప్రజలందరికీ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆ అవకాశం లభించడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ప్రాణాంతకమైన కేన్సర్, కిడ్నీ, గుండె, కాలేయం, ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించి బాధపడుతున్న ఎంతో మంది నిరుపేదలు ఈ పథకం ద్వారా ఉచిత శస్త్ర చికిత్సలు చేయించుకుని హాయిగా జీవిస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్య శ్రీ ద్వారా నియోజకవర్గంలో ఎంతో మంది లబ్ధి పొందారు. ఈ పథకం ద్వారా అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందడం విశేషం. లక్షలు విలువ చేసే శస్త్ర చికిత్సలు ఆరోగ్య శ్రీ ద్వారా పొందిన వారు తమ కృతజ్ఞతను తెలియజేసుకుంటున్నారు. అంతే కాకుండా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అవసరం మేరకు సహాయం అందజేసి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదుకుంటున్నారు. వారి ఆర్థిక పరిస్థితులను అవగాహన చేసుకున్న ఎమ్మెల్యే సొంత నిధుల నుంచి కూడా ఆర్థిక సహకారం అందజేస్తున్నారు. స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, వారికి వారి కుటుంబ సభ్యులకు మనోబలం అందజేస్తున్నారు. అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ కార్డులు లేకపోయినా అధికారులతో మాట్లాడి ఆరోగ్య శ్రీ కార్డులు ఇప్పించి శస్త్ర చికిత్సలు అందజేస్తున్నారు.

ఆరోగ్య శ్రీ ఆదుకుంది



నేను కిడ్నీ వ్యాధితో ఎంతో కాలంగా బాధ పడుతున్నాను. ఆర్థిక స్థోమత లేక సరైన చికిత్స అందని సమయంలో ఆరోగ్య శ్రీ పథకం నన్ను ఆదుకుంది. ఆ పథకం ద్వారా నాకు వారానికి రెండు సార్లు డయాలసిస్ జరుగుతోంది. నగరంలో మెడికవర్ హాస్పిటల్‌లో డయాలసిస్ ట్రీట్‌మెంట్ పొందుతున్నాను. నా ఆరోగ్యం మెరుగుపడింది. ఇప్పుడు నేను నా పనులు స్వయంగా చేసుకుంటున్నాను.

– అద్దూరి మంగవేణి, జెండాచెట్టువీధి

మామూలు మనిషినయ్యా

ఆరోగ్య శ్రీ ద్వారా నాకు కేన్సర్ చికిత్స అందుతోంది. ఇప్పుడు నా ఆరోగ్యం బాగుంది. ముఖ్యమంత్రి దయవల్ల నేను చేయించుకోలేననుకున్న ట్రీట్‌మెంట్ జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నా కష్టాన్ని గుర్తించి నాకు సహకారం అందజేశారు. వారికి కృతజ్ఞతలు.

– పెదగాడి సత్యనారాయణ, జెండాచెట్టువీధి

సంతోషంగా ఉన్నా



కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న నేను ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స తీసుకున్నాను. ఇప్పుడు నా ఆరోగ్యం మెరుగుపడింది. నా కుటుంబంతో సంతోషంగా ఉన్నాను. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

– సీకు జగదీశ్వరి, కొబ్బరితోట

క్లుప్తంగా

చిన్నారుల గ్రీన్‌డే సందడి


ఆకుపచ్చని దుస్తులతో గ్రీన్‌డేలో పాల్గొన్న చిన్నారులు

దాబాగార్డెన్స్ : నగరంలోని జిల్లా పరిషత్ సమీపాన గల ఆలివెట్ స్కూల్లో శుక్రవారం గ్రీన్ డే నిర్వహించారు. పిల్లలందరూ క్లాస్ రూమ్‌లో ఆకుపచ్చ రంగు దుస్తులు.. అదే రంగు ఆట వస్తువులతో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా ఆకుపచ్చ రంగు వస్తువులు.. ఆటపరికరాలను పిల్లలకు చూపించారు. వాటిపై అవగాహన కల్పించారు. ఆకుపచ్చ రంగు ప్రాముఖ్యతను పాఠశాల ప్రిన్సిపాల్ ఆచారి వివరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

పేద ముస్లిం యువతి పెళ్లికి కార్పొరేటర్ సాధిక్ సాయం


రైస్‌బ్యాగ్‌లు అందజేస్తున్న కార్పొరేటర్ మహ్మద్ సాధిక్

జగదాంబ : పేద ముస్లింల ఇంట్లో పెళ్లికి జీవీఎంసీ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ శుక్రవారం సాయం అందజేశారు. ఎండీ ఆరీఫ్ అనే ముస్లిం తన కుమార్తె పెళ్లి కోసం ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న సాధిక్ ఆయన ఇంటికి వెళ్లి బియ్యం బస్తాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే కాకుండా నియోజవర్గం పరిధిలో ఎవరికైనా ఆర్థిక సాయం చేయడానికి ముందుంటానని సాధిక్ తెలిపారు.

దివంగత ఎస్‌ఈ రాజారావుకు నివాళి


రాజారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రసన్నకుమార్ తదితరులు

మహారాణిపేట : విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన ప్రజారోగ్యశాఖ ఎస్‌ఈ కె.రాజారావు సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పాల్గొన్ని రాజారావు చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఎస్‌ఈ నరసింహమూర్తి, క్వాలిటీ కంట్రోల్ ఎస్‌ఈ రామిరెడ్డి, వుడా సీఈ ఈ.శివప్రసాద్‌రాజు, పబ్లిక్ హెల్త్ ఏఈ గణపతిరావు, జీవీఎంసీ, ఇంజినీరు, ఇతర అధికారులు పాల్గొని నివాళులు అర్పించారు.

తక్షణం బకాయిలు చెల్లించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార : అమ్మఒడి, విద్యాదీవెన బకాయిలను వెంటనే చెల్లించాలని పీడీఎస్‌వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్ కోరారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ప్రభుత్వమే ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెండువేల ఐదు వందలకు పైగా రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని, ఎన్‌ఈపీ-2020ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి, ఎం.లలిత, జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైడేతో వ్యాధుల నివారణ


గౌరీవీధిలో డ్రైడేపై అవగాహన కల్పిస్తున్న మలేరియా నివారణ విభాగం సిబ్బంది


జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు స్వీకరిస్తున్న సిబ్బంది

అల్లిపురం : దోమల నివారణకు వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మలేరియా నివారణ సిబ్బంది సూచించారు. 33వ వార్డులో మిరపకాయలవీధి, గౌరీవీధి, సింహాలదేవిడి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆశ వర్కర్లు బి.లీలావతి, బి.పార్వతి అవగాహన కల్పించారు. నీటి ట్యాంకులను ఖాళీ చేసి ఆరనివ్వాలని, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, వాడేసిన కొబ్బరి బొండాలు నిలువ ఉంచరాదని, పాత టైర్లు ఇంట్లో ఉంచరాదని, దోమలు వద్ధి చెందేందుకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక డెంగీ, చికున్ గున్యా, మలేరియా వ్యాధుల నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ ఉన్న గుంతల్లో క్రిమిసంహారక మందులు, కిరోసిన్, వాడిన ఇంజిన్ ఆయిల్లో ముంచిన గుడ్డ వేస్తే దోమ లార్వాలు చనిపోతాయన్నారు. మురుగు నీరు ఎప్పటికప్పుడు వెళ్లిపోయే విధంగా చర్యలు తీసకోవాలని తెలిపారు. నీటి ట్యాంకులు, డ్రమ్ములపై మూతలు సరిగా ఉంచాలని, కిటికీలు, డోర్లకు జాలీలు బిగించాలని, వ్యక్తిగత రక్షణకు దోమతెరలు, కాయిల్స్ వాడాలని, శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలని సూచించారు. మలేరియా సూపర్‌వైజర్ అప్పారావు ఆశ వర్కర్లతో కలిసి జ్వరపీడితుల నుంచి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణలో అంతా భాగస్వాములు కావాలి


డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్

మద్దిలపాలెం : దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్ అన్నారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీలో ఆయన పరిశీలించారు. జీవీఎంసీ యాంటీ మలేరియా బృందం కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి పరిసరాలలో నీటి నిల్వలుంటే వాటిలో లార్వా ఉన్నదీ లేనిదీ గుర్తించాలని సూచించారు. ఇంట్లో ఉండే వారికి తగిన సూచనలు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం వారందరూ వారి ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారం పైబడి నీరు నిల్వ ఉంటే దోమలు ఉత్పత్తి అవుతాయనే విషయాన్ని వివరించాలన్నారు. ప్రస్తుతం మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు అవుతుండడంతో యాంటీ లార్వా ఆపరేషన్ ప్రక్రియ పక్కాగా చేపట్టాలన్నారు. మలేరియా సబ్‌యూనిట్ సూపర్‌వైజర్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ పెంటపల్లి గణేష్, యాంటీ లార్వా బృందం పాల్గొన్నారు.

పోలీసులు దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు


గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి : పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ సిబ్బంది చేసిన కవాతును సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కవాతుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని, 8వ బెటాలియన్‌లో ఉన్నప్పుడు పరేడ్‌కు మరింత ప్రాధాన్యత ఇచ్చేవాడినన్నారు. 2006లో రాష్ట్ర స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పరేడ్ కమాండర్‌గా చేయడం కారణంగా తనకు కవాతుపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఏఆర్ సిబ్బంది చేసిన కవాతును, టర్న్ ఔట్‌ను అభినందించారు. ఏఆర్ సిబ్బంది బందోబస్తుల కంటే ఎక్కువగా ప్రిజన్ ఎస్కార్ట్ డ్యూటీలు, గార్డు డ్యూటీలు, వీఐపీ ఎస్కార్ట్‌లు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర డీజీపీ కె.వి. రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బందికి శాఖాపరమైన అంశాలలో ఏదైనా సమస్య ఉంటే నెలలో కచ్చితంగా ఒక శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని వివరించారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి 11 మంది నగర ఏఆర్ సిబ్బంది నుంచి వినతులు తీసుకొని వాటి పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత దుర్గాబాయి దేశ్‌ముఖ్


ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

ఏయూక్యాంపస్ : మహిళా సాధికారతకు నిదర్శనంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ నిలుస్తారని ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ. నరసింహారావు అన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ జన్మదిన వేడుకల్లో భాగంగా కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ఎంపవర్‌మెంట్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని మహిళా అభ్యున్నతికి పాటుపడిన దుర్గాభాయి దేశ్‌ముఖ్ వ్యక్తిత్వం గురించి వివరించారు. కేంద్ర సంచాలకులు డాక్టర్ పి.ఉష మాట్లాడుతూ అంతర్గత నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటూ ప్రతి మహిళ విజయాన్ని అందుకోవాలన్నారు. రాంకీ ఫౌండేషన్ అధిపతి కె.శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళా సాధికారత, యుక్తవయసు కలిగిన బాలికల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్రం సలహాదారు పీల నాగ వెంకట లక్ష్మి, అర్థశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు, హిమబిందు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో డాక్టర్ టి.సాంబశివరావు, కిరణ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బాక్సర్లకు శిక్షణ ప్రారంభం


శిక్షణలో పాల్గొన్న బాక్సర్లతో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

విశాఖ స్పోర్ట్స్: రైల్వేస్ బాక్సర్లకు శిక్షణ శిబిరం ఈకోర్సా వాల్తేర్ రైల్వే స్టేడియంలో శుక్రవారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు. తొలి బౌట్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బాక్సర్ల నైపుణ్యాలు, సామర్థ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ఆగస్టు 11వ తేదీ వరకు బాక్సింగ్ శిక్షణ శిబిరం జరుగుతుంది. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, బాక్సింగ్ శిక్షణార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్తలుగా..


కరోనా సమయంలో సేవలందిస్తున్న వలంటీర్ వనం లక్ష్మి

అల్లిపురం/జగదాంబ : కరోనా సమయంలో వలంటీర్లు ప్రతి ఇంటికి వచ్చి సర్వే చేశారు. అనారోగ్యంతో బాధపడే వారిని గుర్తించి ఆరోగ్య కార్యదర్శులతో వచ్చి తగిన మందులు ఇచ్చారు. అలాగే లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించే క్రమంలోను ప్రజలకు మార్గదర్శులుగా నిలిచారు. ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్తలుగా సేవలందించారు.

వలంటీర్ల సేవలు మరువలేనివి ..

కరోనా సమయంలో మా వలంటీర్ వనం లక్ష్మి సేవలు మరువలేనివి. ఆమె పర్యవేక్షణలో తగిన మందులు వేసుకుని, డాక్టర్ల సూచనల మేరకు పూర్తిగా కోలుకోగలిగాను. మా కుటుంబ సభ్యులతో పాటు ఆమె తన పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లారు. అక్కడి వారిని నిరంతరం పర్యవేక్షించి సేవలను అందించారు. కరోనా సమయంలో వలంటీర్లు ఇతరుల్లా భయపడకుండా సేవలు అందించి ఉండకపోతే పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. వలంటీర్ వ్యవస్థ వల్లే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.

నిస్వార్థంగా సేవలందిస్తున్నారు



వలంటీర్లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివి. నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారు. ఫోన్ చేయగానే అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారు. పథకాల పంపిణీలో వలంటీర్ల కృషి ఎంతో ఉంది.

–సత్యవతి

జన్మభూమి కమిటీలతో మోసపోయాం.. వలంటీర్లతో లబ్ధి పొందుతున్నాం..



టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో మోసం చేసేవారు. పింఛను ఇవ్వాలంటే డబ్బులివ్వాలి.. ప్రభుత్వం నుండి ఏదైనా లబ్ధి రావాలంటే లంచమివ్వాలి. ఇలా ఉండేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక వలంటీర్ల వ్యవస్థతో అలాంటి బాధలు తప్పాయి. వలంటీర్లు నేరుగా ఇంటికి వచ్చి పెన్షన్లు, పథకాలు అందిస్తున్నారు.

-రమేష్, కల్లుపాకలు

475 మందికి సర్టిఫికెట్లు


లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార : జగనన్న సురక్షతో అందరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎం 27వ వార్డులో గల మండావారి వీధి కమ్యూనిటీ హాల్లో 'జగనన్న సురక్ష'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలం టీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి 845 సమస్యలను గుర్తించారన్నారు. వాటిలో 475 పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు సంబంధిత సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగన్ ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందిస్తున్నామన్నారు. 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి దొడ్డి రామానంద్, స్టేట్ రోడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పద్మనాభ అమ్మాజీ, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్, డీఈ శ్రీనివాస్, పట్టణ ప్రణాళిక విభాగం టీపీవో అనిత, వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌రెడ్డి, మధు, అనిల్, శివారెడ్డి, అప్పలరెడ్డి, శ్రీను, కరుణాకర్‌రెడ్డి, కుమారి, మల్లేశ్వరి, వెంకటేష్, అశోక్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దుర్గమాంబ సమాజం లబ్ధిదారుల ఇళ్లకు రిజిస్ట్రేషన్లు


లబ్ధిదారుడికి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డు దుర్గమాంబ సమాజంలో నివాసం ఉంటున్న 180 మంది లబ్ధిదారులకు శుక్రవారం రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. రోజుకు పది మందికి రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. మొదటి రోజు రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారికి కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు డాక్యుమెంట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ జగనన్న పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారని అన్నారు. టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల నిర్మిస్తున్నారని అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి దేశంలో ఒక్కరే ఉన్నారని ఆయనే జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగరాజు, కండిపిల్లి వరలక్ష్మి, మహంతి గౌరీశంకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు. 34వ వార్డు అచ్చియ్యమ్మపేట జంక్షన్‌లో గల వైఎస్సార్ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంట్లో భాగంగా 38వ వార్డు పరిధిలో ఘోషా హాస్పిటల్ దగ్గర సుమారు 50 సంవత్సరాలుగా 15 కుటుంబాలు నివసిస్తున్నాయి. నెలరోజుల క్రితం దేవదాయ శాఖ అధికారులు వచ్చి ఇళ్లు ఖాళీ చేయాలని, లేదంటే నెలసరి అద్దె కట్టాలంటూ ఆదేశించారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన తక్షణమే ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణతో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు. కొబ్బరితోట ప్రాంతంలో సొంత స్థలం ఉండి బీఎల్‌సీలో ఇళ్లు మంజూరు చేయాలని కోరటంతో ఆయన హౌసింగ్ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి, 38వ వార్డు అధ్యక్షుడు శంకభక్తుల సన్యాసిరావు, 34వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనివాసరావు, లండా రమణ, రామరాజు, అరుగుల రాజు, వాసు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ టమాటాకు తగ్గని డిమాండ్


వినియోగదారుల నుంచి ఆధార్ నంబరు నమోదు చేసుకుంటున్న రైతు బజార్ సిబ్బంది


సబ్సిడీ టమాటాల కోసం జనం బారులు

ఆరిలోవ : ఎంవీపీ రైతు బజార్‌లో సబ్సిడీ టమాటాల కోసం వినియోగదారులు బారులు తీరుతున్నారు. బయటి మార్కెట్‌లో టమాటా ధర తగ్గకపోవడంతో ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ.50కి అందించే టమాటాలకు బాగా డిమాండ్ పెరిగింది. దీంతో వీటి కోసం రోజూ వినియోగదారులు క్యూ కడుతున్నారు. శుక్రవారం మూడు టన్నులకు పైగా టమాటాల విక్రయం జరిగింది. రైతు బజార్ సిబ్బంది వినియోగదారుల నుంచి ఆధార్ నంబరు నమోదు చేసుకొని ఒక్కొక్కరికీ కిలో చొప్పున టమాటాలు విక్రయిస్తున్నారు. ఈనెల 2 నుంచి ఇంత వరకు సబ్సిడీపై 35 మెట్రిక్ టన్నుల టమాటా 35 వేల మంది వినియోగదారులకు విక్రయించినట్లు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు.